క్లుప్తంగా...

ఫంక్షన్ హాల్ టెండర్ల అడ్డగింత

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో ఉద్యోగుల కోసం నిర్మించిన నాన్ టీచింగ్ హోం ఫంక్షన్ హాల్ టెండర్లను ఉద్యోగులు అడ్డుకున్నారు. ఫంక్షన్ హాల్‌ను బయటి వ్యక్తులకు ఇవ్వాలని ఓయూ ఎస్టేట్ అధికారులు చేసిన ప్రయత్నాలను ఉద్యోగ సంఘాల నేతలు అభ్యంతరం తెలిపారు. ఓయూకు సంబంధించిన వ్యక్తులకే ఫంక్షన్ హాల్ లీజుకు ఇవ్వాలని, బయటి వ్యక్తులకు ఇస్తే రూ.20 వేల అద్దెకు ఉద్యోగుల కుటుంబాల శుభ కార్యాలయాలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఓయూ వీసీ జోక్యం చేసుకొని ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.

ఇంటింటికి టీడీపీ

అమీర్‌పేట: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో బీఆర్ఎస్, బీజేపీ విఫలం అవుతున్నాయని సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన ఆరోపించారు. డివిజన్ తులసీనగర్, బేగంపేట ఓల్డ్ కస్టమ్స్ బస్తీలో గురువారం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సతీష్, జయశ్రీ, వాహెద్, ఎం.రాజు,కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సర్వైకల్ బ్రెస్టు కేన్సర్లపై అవగాహన

అమీర్‌పేట: ప్రాథమిక దశలోనే సర్వైకల్ బ్రెస్టు కేన్సర్‌ను గుర్తించడం ద్వారా వ్యాధిని పూర్తిగా నియంత్రించవచ్చని సనత్‌నగర్ ఈఎస్ఐసీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ అబ్‌స్ట్రాటిక్స్, గైనకాలజీ విభాగం వైద్యులు తెలిపారు. ఈఎస్ఐసీ 72వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న విశేష సేవా కార్యక్రమాల్లో భాగంగా గురువారం మహిళా ఐపీలకు కేన్సర్‌పై అవగాహన కల్పించారు.

పార్టీ శ్రేణులకు అండగా ఉంటాం



వైద్య పరికరాన్ని అందజేసిన కార్పొరేటర్ కె. హేమలత

బన్సీలాల్‌పేట్: బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు అన్ని విధాలా అండగా ఉంటామని బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కె. హేమలత అన్నారు. చాచా నెహ్రూనగర్ ప్రాంతానికి చెందిన పార్టీ కార్యకర్త సంపత్ తల్లి అనారోగ్యానికి గురై శ్వాస తీసుకోడానికి ఇబ్బంది పడుతున్నారు. శ్వాసకు సంబంధించి ఓ పరికరాన్ని కొనుగోలు చేయాలని వైద్యులు సూచించగా ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటడంతో విషయాన్ని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి స్పందించి సదరు వైద్య పరికరాన్ని సమకూర్చగా గురువారం కార్పొరేటర్ కె. హేమలత, బీఆర్ఎస్ నాయకులు ప్రేమ్, లక్ష్మీపతిలతో కలిసి సంపత్ ఇంటికి వెళ్లి అందజేశారు.

నేడు ఫాసిజంపై రాష్ట్ర సదస్సు

ముషీరాబాద్: సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాయల సుభాష్‌చంద్రబోస్ 7వ వర్ధంతి సందర్భంగా భారతదేశం–ఫాసిస్టు ప్రమాదం అనే అంశంపై మార్చి 10వ తేదీ (నేడు) ఉదయం 10 గంటలకు బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో స్మారకోపన్యాసాలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ అంశాలపై వీక్షణం సంపాదకులు ఎస్.వేణుగోపాల్, ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్, అఖిల భారత విద్యా హక్కుల వేదిక నాయకులు రమేష్ పట్నాయక్, సామాజిక విశ్లేషకులు దేవి, రచయిత, సంపాదకులు సతీష్‌చందర్, సామాజిక విశ్లేషకులు భార్గవ మాట్లాడుతారన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తా

- ప్రొఫెసర్ నతానీయేల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రొఫెసర్ నతానీయేల్ అన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లిలో బంధు సొసైటీ హైదరాబాద్ అధ్యక్షులు పల్లెల వీరస్వామి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నతానీయేల్ మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు కూడా మండలిలో టీచర్ల సమస్యలను ప్రస్తావించకుండా నిర్లక్ష్యం చేశారని విద్యా రంగానికి యేటా బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గించడంతో విద్యా రంగ సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడడం లేదని రాష్ట్రంలోని అనేక పాఠశాలలకు బోధనేతర సిబ్బంది కూడా లేరన్నారు. సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఉపాధ్యాయులు, అధ్యాపకులు తీవ్ర నిరుత్సాహంతో ఉన్నారన్నారు. తనకు గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

శుభాకాంక్షలు

ముషీరాబాద్: ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఖరారైన ప్రముఖ కవి, రచయిత దేశపతి శ్రీనివాస్‌ను ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఆయన కుమారుడు ముఠా జైసింహ ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

తగ్గనున్న దూరాభారం

- మాణికేశ్వరీనగర్–సీతాఫల్‌మండికి మార్గం సుగమం
- త్వరలో ఆర్‌యూబీ పనులు
- రూ.20కోట్లు కేటాయించిన జీహెచ్ఎంసీ
- 18 భవనాల తొలగింపునకు అధికారుల నివేదిక
- త్వరలో పనులకు శ్రీకారం



మాణికేశ్వరీనగర్–సీతాఫల్‌మండి మధ్యలో ఉన్న రైల్వే ట్రాక్



పాదచారులు వినియోగించుకుంటున్న ప్రస్తుత మార్గం ఇదే

సికింద్రాబాద్ మాణికేశ్వరీనగర్–సీతాఫల్‌మండి ప్రాంతాల వాసులకు దూరాభారం తగ్గనుంది. రైలు పట్టాలకు ఇరువైపుల ఉన్న ఈ రెండు ప్రాంతాలు చూడడానికి పక్కపక్కనే ఉంటాయి. కానీ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లాలంటే 6 కిలో మీటర్ల దూరం అవుతుంది. ఈ రెండు ప్రాంతాల మధ్యన సీతాఫల్‌మండి–ఆర్ట్స్ కళాశాల రైల్వేస్టేషన్లు ఉన్నాయి. రెండు స్టేషన్ల మధ్యలో రైల్వే ట్రాక్ ఉంది. ఫలితంగా రెండు ప్రాంతాల మధ్య నేరుగా రవాణా మార్గం లేదు. వాహనాలు ఉన్న వారు మాణికేశ్వరినగర్ నుంచి సీతాఫల్‌మండి ఫ్లై ఓవర్ మీదుగా సీతాఫల్‌మండి, ఇందిరానగర్, వారాసీగూడకు రావాలి. లేదా ఓయూ డిస్టెన్స్ సెంటర్ మీదుగా వారాసీగూడ, బౌద్ధనగర్‌కు చేరుకోవాల్సి ఉంటుంది. వాహనాలు లేని వారు మాత్రం తప్పనిసరి పరిస్థితుల్లో ప్రమాదకర పరిస్థితులు అధిగమించి ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లాల్సింది. రైలు పట్టాలు దాటుతూ ఒక ప్రాంతం నుంచి మరోవైపునకు ప్రమాదకరంగా దాటాల్సింది.

దశాబ్దాల తరబడి ఇదే తీరు..

రైలు పట్టాలు వేసిన రోజుల్లో ట్రాక్‌కు ఇరువైపుల జనవాసాలు లేవు. ఓయూ వైపు మాణికేశ్వరీనగర్ ఏర్పాటు కాలేదు. సీతాఫల్‌మండి ప్రాంతంలో జనవాసాలు ఉన్నప్పటికీ వాటి నిర్మాణాలు పట్టాల వరకు జరగలేదు. ఈ కారణంగా అప్పట్లో రైల్వే అధికారులు చిన్నపాటి కాజ్‌వే కూడా నిర్మించలేదు. మూడు దశాబ్దాల క్రితం నుంచి ఈ ప్రాంతంలో జనవాసాలు విపరీతంగా పెరిగాయి. ఆర్ట్స్ కళాశాల–సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్ల మధ్యనున్న రైల్వే ట్రాక్‌కు రెండు వైపులా భారీ భవన నిర్మాణ సముదాయాలు ఉండటంతో ఇక్కడి ప్రజల అవసరాల కోసం నేరుగా వెళ్లడం కోసం దారి అవసరం ఏర్పడింది.

మూడు దశాబ్దాలుగా ప్రతిపాదనలు..

సీతాఫల్‌మండి–మాణికేశ్వరీనగర్ ప్రజల రవాణా అవసరాల కోసం రైల్వేట్రాక్ కింది నుంచి (ఆర్‌యూబీ) వంతెన నిర్మించాలన్న ప్రతిపాదన మూడు దశాబ్దాల నుంచి కార్యాచరణకు నోచుకోలేదు. ఎట్టకేలకు జీహెచ్ఎంసీ గత పాలకమండలి హయాంలో ఇక్కడ రోడ్ అండర్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలకు బీజం పడింది. ఆరేళ్ల క్రితం వంతెన నిర్మాణం కోసం నిధులు విడుదల చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని నిర్మాణం ప్రక్రియ కోసం అవసరమైన కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని జీహెచ్ఎంసీ అధికారులు రైల్వేశాఖకు లేఖ రాశారు. టెండరు ప్రక్రియ నిర్వహణ కోసం అవసరమైన నిధులను అందించారు. సాంకేతిక సమస్యల కారణంతో నిలిచిపోయిన ఆర్‌యూబీ నిర్మాణం పనులకు తాజాగా మోక్షం లభించింది. ఇటీవలి జీహెచ్ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ సమావేశంలో ఆర్‌యూబీ నిర్మాణం కోసం రూ.20 కోట్లను నిధులను విడుదల చేశారు.

భవనాల తొలగింపు సర్వే పూర్తి..

ఆర్‌యూబీ నిర్మాణంతో పాటు వాహనాల రాకపోకలకు మార్గం సుగమం చేయడం కోసం 18 భవనాలు తొలగించాలని జీహెచ్ఎంసీ అధికారుల సర్వే వెల్లడి చేసింది. సీతాఫల్‌మండి వైపు 10 భవనాలు, మాణికేశ్వరీనగర్‌వైపు 8 భవనాలను తొలగించాల్సి ఉంది. ఇందులో రెండు భవనాలను మొత్తంగా మరో ఆరు భవనాలను పాక్షికంగా తొలగించాల్సి ఉంది. ప్రస్తుతం సదరు భవనాల యజమానులకు నష్టపరిహారం అందించేందుకు జీహెచ్ఎంసీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే నిర్మాణం పనులు ప్రారంభించనున్నారు.

ఎంతో ఉపయోగం



ఆర్‌యూబీ నిర్మాణం కోసం చిన్నప్పటి నుంచి ఎదురు చూస్తున్నాం. వంతెన అందుబాటులోకి వస్తే రెండు ప్రాంతాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. పక్కపక్కనే ఉన్న ఈ ప్రాంతాలకు వచ్చి వెళ్లడం కోసం ఐదారు కిలోమీటర్లు తిరగాల్సి వస్తుంది. ఆర్‌యూబీ అందుబాటులోకి వస్తే పట్టాలు దాటుకుని వెళ్లేవారికి ప్రమాదకర పరిస్థితులు దూరమవుతాయి.

–గణేశ్, మాణికేశ్వరీనగర్

త్వరలో పనులు ప్రారంభం..



భవనాలు కోల్పోతున్న వారికి నష్ట పరిహారం అందించే విషయంలో సాంకేతిక సమస్యలను దూరం చేసే పనిలో జీహెచ్ఎంసీ అధికారులు ఉన్నారు. నష్ట పరిహారం అందించిన వెంటనే పనులు ప్రారంభం చేస్తాం. సత్వరమే ఆర్‌యూబీ నిర్మాణం పనులు పూర్తి చేసి సీతాఫల్‌మండి–మాణికేశ్వరీనగర్ ప్రాంతాల ప్రజల రవాణా సదుపాయాన్ని సుఖవంతం చేస్తాం.

–టీ.పద్మారావుగౌడ్, శాసనసభ డిప్యూటీ స్పీకర్

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్



మహిళా దినోత్సవంలో పాల్గొన్న రైల్వే జీఎం ఏ.కే. జైన్

అడ్డగుట్ట: కూతుళ్లను కుమారులతో సమానంగా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం సికింద్రాబాద్ రైల్ నిలయంలోని ఆడిటోరియంలో ఎంప్లాయీస్ సంఘ్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రైల్వే జీఎం ఏ.కే. జైన్ హాజరై మాట్లాడారు. పురుషులకు సాటిగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఇదే విధంగా ముందుకు సాగాలన్నారు. మహిళలు వారి హక్కుల సాధన కోసం స్వతంత్రంగా పోరాటానికి విద్యావంతులుగా మారాలన్నారు. గతంలో కన్నా ప్రస్తుత మహిళల జీవితాల్లో అనేక మార్పులు వచ్చాయన్నారు. అప్పట్లో ఇంటికే పరిమితమైన మహిళలు నేడు అన్ని రంగాల్లో ఓ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకుంటూ దూసుకుపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు జీఎం ఉదయ్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపల్ సీపీఓ రాజీవ్ కిషోర్, చీఫ్ కమర్షియల్ మేనేజర్ పద్మజ, టీవీ సీరియల్ నటి పల్లవి రామిశెట్టి, ఎంప్లాయీస్ సంఘ్ ఏజీఎస్‌లు భరణి భాను, షేక్ రవూఫ్, రుద్రారెడ్డి పాల్గొన్నారు.

అడ్డగుట్ట వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో..

అడ్డగుట్ట: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. గురువారం లోహియానగర్‌లో అడ్డగుట్ట వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళ దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పురుషులకు సాటిగా అన్ని రంగాల్లో తమదైన శైలిలో మహిళలు దూసుకుపోతున్నారన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు టీఆర్ఎస్ ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ వికలాంగుల సంఘం ఫీల్డ్ ఆఫీసర్ విజయలక్ష్మి, వరల్డ్ విజన్ సంస్థ ప్రతినిధులు జ్యోతి, బాలమణి, శ్యామ్‌సుందర్ రెడ్డి, భవాని పాల్గొన్నారు.

పూల ఆంథోనిని కలిసిన క్రైస్తవ నాయకులు, పాస్టర్లు



ఆంథోనిని సన్మానిస్తున్న క్రైస్తవ ప్రముఖులు

రాంగోపాల్‌పేట్: హైదరాబాద్ ఆర్చ్ డయాసిస్ బిషప్, కార్డినల్ పూల ఆంథోనిని మైనార్టీ కమిషన్ మాజీ చైర్మన్ రాజారపు ప్రతాప్ ఆధ్వర్యంలో గురువారం పలువురు క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, ఇండిపెండెంట్ చర్చిల బిషప్‌లు, పాస్టర్లు, దళిత నాయకులు కలిసి సన్మానించారు. కార్డినల్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా రాజకీయ, విద్య, వైద్య, సేవా కార్యక్రమాల గురించి అందరూ కలిసి చర్చించారు. కార్డినల్ పూల ఆంథోని అట్టడుగు వర్గాల నుంచి వచ్చి కార్డినల్ స్థాయికి చేరుకున్నారని జీవితంలో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని కొనియాడారు. త్వరలోనే ప్రభుత్వం, తెలుగు ఫెడరేషన్ ఆఫ్ చర్చెస్ తరుపున కార్డినల్‌ను సన్మానించేందుకు ఏర్పాట్లు చేయాలని వారు అభిప్రాయపడ్డారు. గతంలో ముఖ్యమంత్రి అన్ని డినామినేషన్లకు చెందిన పాస్టర్లు, దళిత క్రైస్తవ నాయకులను ఏకం చేసి బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలని ముఖ్యమంత్రి సూచించినట్లు రాజారపు ప్రతాప్ తెలిపారు. త్వరలోనే 200 మంది బిషప్‌లు, పాస్టర్లు, క్రైస్తవ ప్రముఖులతో ముఖ్యమంత్రితో ప్రత్యేక సమావేశం ఉంటుందన్నారు. బిషప్ విల్సన్ సింగం, బిషప్ ముల్కల భాస్కర్, బిషప్ దయానంద్, ఎస్సీ కమిషన్ చైర్మన్ బండా శ్రీనివాస్, అదనపు ఎస్పీ రాజారత్నం, ప్రొఫెసర్ మురళి దర్శన్, కిరణ్ పాల్గొన్నారు.

పాఠశాలలో పవర్ బోర్ పనులు ప్రారంభం



బోరు పనులను ప్రారంభిస్తున్న బాల్‌రెడ్డి

అమీర్‌పేట: సనత్‌నగర్ రౌండ్ టేబుల్ పాఠశాలలో గురువారం పవర్ బోర్ పనులను ప్రారంభించారు. వేసవి దృష్ట్యా నాలుగు రోజుల క్రితం సిబ్బంది కార్పొరేటర్ కొలను లక్ష్మిబాల్‌రెడ్డిని కలిసి పాడైన బోరు గురించి వివరించగా కార్పొరేటర్ స్కూలు సిబ్బందితో కలిసి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ వద్దకు వెళ్లి సమస్యను వివరించారు. స్పందించిన మంత్రి రూ.6 లక్షలు మంజూరు చేయగా గురువారం ఉదయం డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు బాల్‌రెడ్డి స్కూలు సిబ్బందితో కలిసి బోరు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రాధానోపాధ్యాయులు వహీద్ తస్వీర్, కిరణ్‌కుమార్, పీఈటీ బసవరాజు, స్వరూపరాణి, అరుణ, స్వర్ణకుమారి, శిరీష, మాధవి, సత్యం రామకృష్ణ పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి అదృశ్యం



మౌనిక, శ్రీకాంత్, అయోధ్య

చిలకలగూడ : వేర్వేరు ఘటనల్లో ముగ్గురు అదృశ్యమైన ఘటన చిలకలగూడ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ తుల్జారామ్ వివరాల ప్రకారం.. చిలకలగూడ దూద్‌బావికి చెందిన మౌనిక (22) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. గత నెల 24న బయటకు వెళ్లిన మౌనిక ఎంతకీ తిరిగి రాకపోవడంతో తల్లి రాములమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

- యాప్రాల్ అంబేడ్కర్ నగర్‌కు చెందిన శ్రీకాంత్ (26) మెట్టుగూడలోని మెకానిక్ షెడ్‌లో పని చేస్తూ సమీపంలోని బంధువుల ఇంట్లో ఉంటున్నాడు. ఈనెల 4న తండ్రి కిషోర్ వచ్చి ఆరా తీయగా కొన్ని రోజులుగా విధులకు రావడం లేదన్నారు. బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు.
- చిలకలగూడ దూద్‌బావికి చెందిన అయోధ్య (68) ఇటీవల ఇంటి నుంచి బయటకు వెళ్లి ఎంతకీ రాకపోవడంతో కుమారుడు రాజ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రైల్లో బంగారు ఆభరణాల బ్యాగు చోరీ

కాచిగూడ: రైలు ప్రయాణికురాలి బంగారు, వెండి వస్తువుల బ్యాగు చోరీకి గురైన సంఘటన కాచిగూడ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. గౌలిగూడకు చెందిన కవిత రాజ్‌పుత్ ఈ నెల 8న అహ్మదాబాద్ నుంచి రైల్‌లో నగరానికి వస్తుండగా నాందేడ్ వద్ద 35 గ్రాముల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, రెండు సెల్ ఫోన్లు ఉన్న బ్యాగు చోరీకి గురైంది. గురువారం బాధితురాలు కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు జీరో ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పోలీసులకు బదిలీ చేశామన్నారు.

పెళ్లి కావడం లేదని యువతి ఆత్మహత్య

కాచిగూడ: వివాహం కావడం లేదని ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్ఐ రవి కుమార్ వివరాల ప్రకారం.. బర్కత్‌పుర ప్రాంతానికి చెందిన గోరిబీ (27) తనకు పెళ్లి కావడం లేదని మనస్తాపం పడుతూ ఉండేది. గురువారం సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తల్లి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఉమాప్రకాశ్

సికింద్రాబాద్: కుక్కల బారి నుంచి ప్రజలను రక్షించడం కోసం అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ జాయింట్ కమిషనర్ ఉమా ప్రకాశ్ చెప్పారు. సీతాఫల్‌మండి డివిజన్‌లోని కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, వీధి కుక్కలకు ఆహారం అందిస్తున్న వ్యక్తులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రమాదకరంగా మారిన కుక్కల విషయంలో ఫిర్యాదులు అందించిన వెంటనే తమ బృందాలుస్పందించి ఆయా ప్రాంతాలకు వెళ్లి పట్టుకుని తరలిస్తున్నారన్నారు. కుక్కల విషయంలో ప్రమాదకర పరిస్థిలు ఏర్పడుతున్న సందర్భాల్లో ఆయా ప్రాంతాల జీహెచ్ఎంసీ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. అదే విధంగా కుక్కలకు ఆహారాన్ని అందించే వ్యక్తులు, పిల్లలు కుక్కల విషయంలో పాటించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ పాలక మండలిని నియమించాలి

లిబర్టీ: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు పాలక మండలిని నియమించాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముడి మార్టిన్ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన దళిత హక్కుల పోరాట సమితి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, కమిషన్‌కు మూడేళ్లుగా చైర్మన్, సభ్యులను ప్రభుత్వం నియమించలేదన్నారు. దీంతో దళిత, గిరిజనుల సమస్యలు పరిష్కారం కావడం లేదని, ఆ వార్గలపై దాడులు జరిగితే ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. దళితుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం వెంటనే ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు పాలక మండలిని నియమించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మార్టిన్ కోరారు.

బాబోయ్ భౌభౌ

ఓయూ క్యాంపస్‌లోనూ కుక్కల బెడద ఎక్కువవడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. వివిధ హాస్టళ్లతో పాటు కాలేజీలు, కార్యాలయాల ఆవరణాల్లో గుంపులు గుంపులుగా తిష్ట వేస్తున్నాయి. ఒంటిరిగా వెళ్తే చాలు వెంబడిస్తున్నాయని సంబంధిత అధికారులు స్పందించి కుక్కల బెడదను నివారించాలని అధ్యాపకులు, విద్యార్థులు కోరుతున్నారు.

– ఉస్మానియా యూనివర్సిటీ



బ్రిడ్జిపై మరమ్మతులు చేయాలంటూ ధర్నా



బ్రిడ్జిపై ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు

లాలాపేట: లాలాపేట నుంచి మౌలాలికి వెళ్లే బ్రిడ్జిపైనున్న రోడ్డుకి మరమ్మతులు చేయాలని ఏఐటీయూసీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఫ్లైఓవర్‌పై గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా స్టేట్ కౌన్సిల్ మెంబర్ బెజ్జాల కృష్ణమూర్తి మాట్లాడుతూ.. ఫ్లైఓవర్‌పై ఏర్పడ్డ గుంతలతో తార్నాక, లాలాపేట నుంచి మౌలాలి, ఈసీఐఎల్ వరకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందన్నారు. బ్రిడ్జి జాయింట్ల వద్ద గుంతలు ఏర్పడటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాన్నారు. అంతేకాక గుంతలమయంగా బ్రిడ్జిపై రాకపోకలు సాగిస్తే తమ ఆటోలు పాడయ్యే అవకాశం ఉందన్నారు. ఈ విషయమై గతంలోనే పలుమార్లు జీహెచ్ఎంసీ అధికారులు, ట్రాఫిక్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు స్పందించి బ్రిడ్జిపై మరమ్మతులు చేయాలన్నారు. ధర్నాలో ఆటో శ్రీనివాస్, ఎండీ మస్తాన్ ఖాన్, మల్లేష్, రాజు, అమీర్, జావీద్, సురేష్, మున్నా, అబ్దుల్ తాహ పాల్గొన్నారు.

రసాయనాల వినియోగ నివారణకు కృషి

రైతుల సమ్మేళనం శాస్త్రవేత్తలు



మాట్లాడుతున్న ప్రొ. అప్పారావు

లాలాపేట: వన్ వీక్ వన్ ల్యాబ్ పేరుతో సీఎస్ఐఆర్–ఐఐసిటిలో ఈ నెల 7 నుంచి 12 వరకు కొనసాగుతున్న కార్యక్రమంలో గురువారం కిసాన్ మేళా–సొసైటీ టెక్నాలజీపై సదస్సు జరిగింది. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి, ప్రపంచ బ్యాంక్ మాజీ కన్సల్‌టెంట్ డైరెక్టర్ రాజిరెడ్డి, హైదరాబాద్ యూనివర్సిటీ వీసీ ప్రొ.అప్పారావు పాల్గొని మాట్లాడారు. రైతులు తమ ఇన్‌పుట్ ఖర్చులను తగ్గించడంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. నానో టెక్నాలజీ ద్వారా ఇన్‌పుట్ సామర్థ్యం పెరగడంతో పాటు మంచి ఉత్పత్తులను అందించడానికి శాస్త్రవేత్తలు కృషి చేయాలన్నారు. సీఎస్ఐఆర్–ఐఐసిటి డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. సిరిపురం గ్రామాల్లో సంప్రదాయ చేనేత వీవింగ్ క్లస్టర్ వ్యర్థ జాలల శుద్ధి కోసం వికేంద్రీకృత ఈటీపీ మోడల్‌పై ఇనిస్టిట్యూట్‌కు చెందిన చీఫ్ సైంటిస్టు డాక్టర్ వెంకటమోహన్ నేతృత్వంలో శాస్త్రవేత్తల బృందం పని చేస్తుందన్నారు. చీఫ్ సైంటిస్టు డాక్టర్ సుబ్బారెడ్డి కిసాన్ మేళా గురించి వివరించారు. మితిమీరిన రసాయనాల వినియోగాన్ని నివారించేందుకు కృషి చేస్తామన్నారు. నేలను సారవంతం చేయడంతో పాటు రైతుల ఆరోగ్యం దృష్ట్యా వాటిని మెరుగుపరిచేందుకు వ్యవసాయ సంఘాలతో సైతం కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు.



సదస్సులో పాల్గొన్న పారిశ్రామికవేత్తలు, రైతులు

వినియోగదారుల మన్ననలు పొందాలి



మాట్లాడుతున్న ముఠా జయసింహ

లాలాపేట: రాజా ఇన్ఫ్రా డెవలపర్స్ సేవలు రాష్ట్రమంతా విస్తరించాలని బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకుడు ముఠా జయసింహా అన్నారు. గురువారం తార్నాకలోని రాజా ఇన్ఫ్రా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని సంస్థ నూతన లోగోను ఆవిష్కరించి మాట్లాడారు. వినియోగదారుల మన్ననలు పొందినప్పుడే సంస్థలు, వ్యాపారాలు వృద్ధిలోకి వస్తాయని ఆ దిశగా ముందు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో డిజిటల్ డ్రాప్ సొల్యూషన్ ఫౌండర్ సీఈఓ అశోక్‌రెడ్డి, సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.ఎస్. రాజు, అక్షిత చీఫ్ ఎడిటర్ దాస్ మాతంగి పాల్గొన్నారు.